# అ మ రా వ తి

వైభవ. దేవేంద్రుడు, వాసిరెడ్డి వెంకటాద్రి ప్రభువు. కృష్ణకు యిద్దరి అద్దరి మాగాణం అంతా చెక్కుచెదరని ధర్మ విక్రమంతో, ప్రజలకు తండ్రిగా, పెద్దలకు విధేయుడుగా, శాసనానికి తలవరిగా, శత్రువులకు చండశాసనుడుగా, ఏలుకుంటూన్న చల్లని హయాములో—

ఎల్లవేళలా, ఎండనక - నీడనక, విచ్చుకత్తులవారు, బరిసెలవారు, బల్లాలవారు, వీనుమిగిలిన వీరరాహుతులందరూ పచ్చెపువాళ్ళ బాదరబందీ, ఏ పరగణాకూ సోకనీకుండా వేయికన్నులుగా వేయికివేయి బాహువులుగా, పరాక్రమాల మెలగుతూ ఉండగా,—

సింగారం పొలిమేరల్లో, ఎన్ని తరాలుగానో ఊడ పాదుకున్న మర్రి - నీడను ఏనాడో, తలపండిన తబిసి చిన్న

పర్ణశాలలో, బుల్లితులసీ బృందావనంమయంగా, కృష్ణాజినం మీద, చిత్రాసనం మీద, దర్భాసనం మీద పద్మాసనంగా-పొద్దు పొడిచిం దెరుగక, సంజకమ్మిం దెరుగక అలా కదలని కాలూ మూసిన కన్నుగా మనకు కానరాని, అదేదో మగతలో ఉండిపోయినాడు.

చివరకు ఎన్నాళ్లకో ఓనాడు, ఆ తబిసిగుండెల్లో, బొమముడిలో చిక్కిన వెలుగు పట్టపగ్గాలు లేక, ఉబికిఉబికి పండు వెన్నెలై రెక్కలకు అందనిమేరకూ పులుగులు నేరని దూరాలకూ ఎగిసిపడి ఎగబాకి, ఆకాశగంగై వరాహస్వామి ఉద్ధరించిన చేనంతా చిలకరించింది: తబిసి కన్ను తెరిచాడు.

తానై కన్ను తెరిచాడు; తనో మనిషి ననుకున్నాడు; తన్ను తా నెరిగినాక దగలున్నాయ్ దప్పికలున్నాయ్ - దాహమైంది తబిసికి. కమండలం ఉంది - ఉదకం లేదు.

ఎవరీ పనికిమాలిందని ఎలుగెత్తనిహానం ఉరుములు పెటున గర్జించింది.

ఆమడదూరాన లేడల్లే పోతూన్న - నీడమనిషి ఒక్క చుట్టుతిరిగి, తబిసి ముందర గిరవాటుపడి, సొమ్మసిల్లబోతూ, నేనే అయ్యా, అని ఆ పాదాలకు మనవిచేసుకున్నాడు.

"నేనంటే"

"దొంగను."

"కావేమో !"

"నాకా అనుమానం లేదయ్యా !

పుట్టింది దొంగ కడుపున

పెరిగింది దొంగ ఒడుపున-
కాదంటే నాకు అవమానం కాదయ్యా!
అది మీ అజ్ఞానం—"

తబిసి, కనపడని కదలికతో, కనురెప్పల్లో రవంతగా, ఆ పలుకులకూ ప్రొక్కాడు-

"శపించనా!"

"కూడదయ్యా! చేసిన తపసంతా, నా పాపంమీద కత్తి పదునుగా ధారపోస్తారా!

"శిక్షించే వరం - ఏ మహారాజుపరమో చేయండి." నీడ వెలుగులో మాయమైపోయింది.

పిండారీ మూకలు, దేశం గగ్గోలుచేస్తున్నాయ్. పరగణా అంతటా ఒకటే నరుకుల - వేట్లాట - మన్నె సుల్తానుకు ఈ బెడద చెవి సోకనీకుండా, ప్రజలే, ఏ వాడకు ఆ వాడను, ఏ సీమకు ఆ సీమను కాచుకుంటున్నారు.

సంకురాతిరి పండుగపూట, తెల్లవారకముందే వెంకటాద్రి ప్రభువు కృష్ణలో స్నానం చేస్తు ఉన్నపాటున ఉండి, ఉలికిపాటుగా "పట్టిందితాతగారూ!" అని, ధైర్యంగానే కేక వేశారు!

అల్లంత దూరాన జపం చేసుకుంటున్నారు- పాపయారాధ్యులవారు. వారు అరగన్నుగానే, "దేశానికా నీకా, నాయనా!" అని తనలోతాను అనుకున్నారు.

పట్టింది మొసలే అయితే, ఆ మెలుకువ తెలుసును నాయుడికి. ఆ వేటలో తరతరాలుగా మొనగాడాయెను.

కాని ఆ పట్టు మొసలిపట్టుకాదు. ఆ ఒడుపు మొసలి ఒడుపు కాదు. కాలు కరకర మనలేదు. నీరు కందలేదు.

పట్టిన దొంగ పాదంవిడిచి ఉవ్వెత్తున నిలుచున్నాడు.

"ఎవరవయ్యా!" అన్నారు ప్రభువులు.

"బతిమాలేందుకు, పాదం పట్టిన వాడినయ్యా! తల్లి కడుపున తారసిల్లాం - దానంచేయవయ్యా - దయా, జాలీ, ఆచేత, ఈచేత ధారపోయవయ్యా తండ్రీ!"

పాపయారాధ్యులు - సందడిగా చేరువకు వస్తున్నారు- వస్తూనే సెలవిస్తున్నారు- "మరి, పలువిప్పకు మొనగాడా!

అర్థమయేట్టు చెప్పేవుసుమీ! ప్రభువులకు పాపభీతి బలిసి, పుణ్యానికి వేసగి వచ్చింది"

వెంకటాద్రినాయుడు తన మనసు ధారాదత్తంచేశాడు. దొంగ ఒక్క మునకతో ఏటిపాలై పోయినాడు.

వేటలో పట్టితెచ్చిన మృగాలనూ వేడుకచూపించడం ప్రభువులకు అలవాటు. పిండారిమూకను పట్టితెచ్చారని పరగణా అంతటా ఒక్క చిటికెలో సాటింపు అయింది. తిరునాళ్ళకు వచ్చింది ప్రజ-

ఒక్కబారున ఒకే వెన్ను విరుపున చింతలతోపులో ఉంది పిండారిమూక. అటునుంచి నరుక్కువస్తున్నాయ్ విచ్చుకత్తులు: ఇటునుంచి నరుక్కుపోతున్నాయ్ పట్టాకత్తులు, తలలన్నీ రాలినాయ్. ఒక్క తల మిగిలింది. అక్కడ అన్నికత్తులూ ఆగినాయ్.

ఆ తల ఝుళిపించింది. ఆ కళ్ళు కత్తులు సానబెట్టినాయ్. కాని ఏ చెయ్యీ ఆడలేదు! ఏ అడుగూ ఆడలేదు!

"నాయనా!" అన్నది గొంతు:

కన్నెదుట పిలిచేది. ఆ దొంగ పిలుస్తూన్నది - పాపయారాధ్యులు.

"ఆఁ" అన్నాడు నాయుడు.

చేత కత్తి అందుకుని, ఓరగా చేరువయినాడు.

"ఏం ప్రభూ! దానంపట్టినవాడు ఈవరం మీాపరం చేస్తున్నాడు. ఒక్కవేటు విసురు!"

ప్రభువు ఇంకా జంకుమీాదే ఉన్నాడు.

"నీవు పిండారీవా?"

"కాను! అంతకన్న గండడిని. ఏం అయ్యా! ఎన్నిసార్లో పట్టి తెప్పించావు పిండారిమూకను. ఎందరినో నరికించావు కాని, ఎప్పటికప్పుడే జాలిపడి అటునుంచి నరికించి ఇటు విడిచావు; ఇటునుంచి నరికించి అటు విడిచావు. నీది దయ అనుకున్నావ్. అంతకే ధర్మమనుకున్నావ్. నీ జాలి మాకు చేటుకానా; మీా ధర్మం పరగాకు ఆపదకానా; మాటికి మాటికి మంటలు ఆర్పావే కాని, చిటిలే రవ్వల్ని ఏం చేశావ్! ఇక చాలించయ్యా! నీకు ప్రజలకన్న దైవముందా, మా మేలుకన్నా పూజ ఉందా? - ఏలే ప్రభువుకు ఎవరు వంకబెడతారు? ఎదుటపడి, ఎవరు తప్పు దిద్దుతారు? నేనొక్కణ్ణే!"

ఏలేవారి తప్పు - నా తప్పుగాదా అనుకున్నా !

"ఎన్ని పుటకలుగానో పరగణాలో దోచుకు బతికేందుకు హక్కు మాకు ఉంది. పచ్చగాఉన్నా దోచుకుంటే అందంకాని, అల్లాడిపోయే ప్రజను చూస్తే గుండె తరుక్కుపోయింది; అటూ చేయిపోలా, నా ధరమంమీాద మనుసూ పోలా.

చలిదన్నా ముట్టకుండా యిటూ పడివచ్చా ! మర్రి క్రింద ఓ అయ్య ముక్కు మూసుకునిఉంటే ఖారబుర్రల్లో నీరు కాసిని పుక్కిటపట్టినా ! ఆ అయ్య కన్ను తెరిపించి కసిరించుకున్నా. ఒక్క ఉరకనువచ్చి, నీ పాదంపట్టినా - దానంపట్టినా దండులో కలిసి కాళ్లబంధామల్లే ఎటూ మెసలనీకుండా - మీాచేత పట్టించినా.

నరికిన పుణ్యం మీాదేగాని, నరికించిన పంపా నాకెందుకూ - విసురు !—"

నాయుడు ఆ కత్తితోనే ఆ చేతులలా జోడించి "అమరేశ్వరా !" అన్నారు తగని జాలిగా.

"విసురు !"

విసురన్నమాట విసురున, కత్తి చళుకుమనడమేమిటి, ఆ తల ఎగిరిపడడమేమిటి!

తలలేని మొండెం తపసులో ఉన్నట్టు పద్మాసనం వేసింది-తడుపుకోకుండా వచ్చి, జీవంతోవున్న వేలు ప్రభువు నొష్టను తిలకం అద్దింది, నెత్తురు జీరతో.

ఆ దొంగ ఆచోకీలేదు. ఆచోటి కిప్పుడు ఆనవాలు లేదు; ఆ కథా కమామీషూ నిన్నా మొన్నా పుట్టినవాళ్లకు ఎరికేలేదు!

నాయడిపేరు శిలాక్షరంగా ఉంది! ఆ ప్రభువు ధర్మం నూటొక్క గుడిలో దివ్వై వెలుగుతూంది–ఎవరి తపసో నిలిచింది. ఎలాగో వెలిసింది **అమరావతి.**